# అబద్ధమే సిగ్గుపడేలా!

> మొదటిపేజీ తరువాయి...

బుకాయించింది. 'చెట్లు పెరిగినంత మాత్రాన అడవి అయితదా?.. అక్కడ జింకలు ఎక్కడున్నయి? నెమళ్లు ఎక్కడంటె అక్కడుంటయి' అంటూ హేళన చేసింది. వందకు పైగా ఎకరాల్లో చెట్లను కూలగొట్టడంతో ఏకంగా సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని పనులను ఆపి వేయించింది. అసలు అది అడవే కాదన్న ప్రభుత్వం ఇప్పుడు కొత్త పాట అందుకున్నది. 2వేల ఎకరాల్లో ఎకో పార్కు ఏర్పాటు చేయిస్తామని బాకా పత్రికలకు లీకులిచ్చి కథనాలు రాయించుకున్నది. ఈ క్రమంలో కొన్ని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అసలు అక్కడ వివాదం మొదలైందే చెట్లను కూల్చివేయడంపైన! వందల ఎకరాల్లో అడవిని ధ్వంసం చేసి అరుదైన చెట్లు, గడ్డి జాతులు, వన్యప్రాణుల ఉనికిని ప్రమాదంలో పడేయడం పైన! మరి ఇప్పుడు మరి సర్కారు సాగించిన ఈ విధ్వంసానికి ఇప్పుడు పాడుతున్న 'ఎకో పార్కు' పాటకు పొంతన ఎక్కడిది? గురువారం మధ్యాహ్నం హెచ్‌సీయూ భూముల విషయంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఆ 400 ఎకరాల భూములను ఎవరూ కొనొద్దని, మూడేండ్ల తర్వాత తాము అధికారంలోకి వచ్చాక అక్కడ దేశంలోనే అతిపెద్ద ఎకో పార్కును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కేటీఆర్ మాటతో కాంగ్రెస్ పెద్దలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అటు సుప్రీంకోర్టు అక్షింతలు, ఇటు కేటీఆర్ ప్రకటనతో బెంబేలెత్తి తాము కూడా ఎకో పార్కు కోసమే ఇదంతా చేస్తున్నట్టు బుకాయించే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా బాకా పత్రికలకు లీకులు ఇచ్చి '2 వేల ఎకరాల్లో ఎకో పార్కు ఏర్పాటు' అంటూ కథనాలను వండి వార్పించారు. దీంతో ప్రభుత్వం, బాకా పత్రికలు ప్రజల్లో నవ్వుల పాలయ్యాయి.

**జీవాలను చెల్లాచెదురు చేసి......**

అసెంబ్లీ వేదిక మొదలు సెంట్రల్ యూనివర్సిటీ వరకు.. ముఖ్యమంత్రి నుంచి కాంగ్రెస్ కార్యకర్తల దాకా 'అవి సెంట్రల్ యూనివర్సిటీ భూములు కావు.. ప్రభుత్వానివే! తెగ నమ్ముకుంటం మీకేంది?' అని కుండబద్దలు కొట్టినట్టు ప్రకటించారు. ఉన్నపళంగా భూములపై పడి పచ్చని చెట్లను నేలకూల్చారు. మూగజీవాలను చెల్లాచెదురు చేశారు. అమాయక విద్యార్థులను చావబాది కేసులు పెట్టారు. బీఆర్‌ఎస్ మీద ఎదురుదాడి చేసి విద్యార్థుల పోరాటానికి రాజకీయ రంగు పులిమారు. హెచ్‌సీయూ భూములు అమ్మితే తప్ప ఆర్థికంగా సర్కారు అడుగు ముందుకు వేయని దుస్థితి వల్లే సరస్వతి నిలయంలోకి బుల్డోజర్లతో దండయాత్రకు ఒడిగట్టినట్టు స్పష్టమవుతున్నది. కానీ సర్కారు పెద్దలు ఊహించనిరీతిలో సాక్షాత్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం రంగంలోకి దిగింది. ఏకంగా హైకోర్టు రిజిస్ట్రార్‌తో నివేదిక తెప్పించుకొని సర్కారు తీరుపై కన్నెర్రజేసింది. ఇక ఒక్క చెట్టు నేలరాలినా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. దీంతో రేవంత్ సర్కారుకు దిమ్మతిరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యూహం బెడిసికొట్టింది. 'మేము అధికారంలోకి రాగానే ఆ భూముల్లో ఎకో పార్కును ఏర్పాటు చేస్తాం' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే సర్కారు ఎకో పార్కు పాటను అందుకున్నది. బాకా పత్రికలకు లీకులిచ్చి 2వేల ఎకరాల్లో ప్రపంచంలోనే అతి పెద్ద ఎకో పార్కును ఏర్పాటు చేసే దిశగా మంత్రుల కమిటీ యోచిస్తున్నందంటూ కథనాలు వండి వార్చింది. తమను భంగపాటుకు గురి చేసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీనే కబళించి ఫ్యూచర్ సిటీకి తరలించాలనే మరో కుట్రను బహిర్గతం చేసింది. నిజంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అక్కడ ప్రపంచంలోనే అతి పెద్ద ఎకో పార్కును అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనే ఉంటే టీజీఐఐసీ ద్వారా ఆ భూములను తనఖా పెట్టి రూ.10వేల కోట్ల రుణాన్ని ఎందుకు తెచ్చినట్టు? అది చాలదన్నట్లు.. రూ.30వేల కోట్లకు ఆ భూములను అమ్మేందుకు నోటిఫికేషన్ ఎందుకు ఇచ్చినట్టు? పైగా వారం రోజులుగా ఇంత రాద్ధాంతం ఎందుకు చేసినట్టు? ఏడాదిన్నరలో అభివృద్ధి పనులకు తట్టెడు పని చేయని రాష్ట్ర ప్రభుత్వం, రాత్రిపూట వందల సంఖ్యలో బుల్డోజర్లతో అడవిని ఎందుకు ధ్వంసం చేసినట్టు? 400 ఎకరాలను అమ్మి సొమ్ము చేసుకోవడమే తప్ప ప్రభుత్వ పెద్దల పుర్రెల్లో పర్యావరణాన్ని ఉద్ధరించాలనే సదుద్దేశం లేదనేది లోకమంతా తెలిసిన సత్యం.

**అమ్మితే తప్ప అడుగు పడదు..**

రాష్ట్రంలో రియల్-నిర్మాణ రంగాలు కుదేలయ్యాయి. సర్కారు విధానాలతో ప్రభుత్వానికి ఆదాయం గణనీయంగా పడిపోయింది. వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీల అమలు ముందుకుపోక.. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో తాకట్టు భూములను తెగ నమ్ముకొని రూ.30 వేల కోట్లు తెచ్చుకుంటే తప్ప ఊపిరాడదని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారు. తాకట్టు రుణ ఒప్పందంలోనే అమ్మేందుకు వెసులుబాటు ఉన్నందున టీజీఐఐసీ ద్వారా 400 ఎకరాల విక్రయానికి రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు భూములను అమ్ముతున్నట్టుగా టీజీఐఐసీ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. దీంతో యూనివర్సిటీ విద్యార్థులు నిరసన బాట పట్టారు. ప్రధానంగా గత నెల 13 నుంచి తమ ఆందోళనలను ఉధృతం చేశారు.

**పచ్చని అడవిపై తలో అభాండం..**

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఉద్యమ బాట పట్టి వర్సిటీ భూములను అమ్మొద్దంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' వారి ఆందోళనలను ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. దీనికి తోడు సామాజిక మాధ్యమాల్లోనూ ఆందోళన వేడి ఎక్కువైంది. జీవ వైవిధ్యానికి నెలవైన ఆ భూములను కాపాడుకోవాలంటూ పర్యావరణవేత్తలు, మేధావులు సైతం విద్యార్థులతో కలిసి పోరాటం చేశారు. దీంతో ప్రభుత్వ పెద్దలు తలోమాట మాట్లాడుతూ విద్యార్థుల ఆందోళనలను అపహాస్యం చేశారు. సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా 'ఆ 400 ఎకరాల్లో ఏ జంతువూ లేదు.. గుంటనక్కలు చేరి రాద్ధాంతం చేస్తున్నరు' అంటూ విద్యార్థులను అవమానించేలా మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యార్థుల ఫొటోలు, డాక్యుమెంటరీలను సైతం తప్పుబడుతూ అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించిన ఫేక్ చిత్రాలు అంటూ హేళన చేశారు. ఇతర మంత్రులు, కాంగ్రెస్ నేతలు తలోరీతిన అక్కడ చెట్లు లేవు.. మూగజీవాలు లేవు.. అంటూ ఇష్టానుసారంగా మాట్లాడారు.

**యూనివర్సిటీపై బుల్డోజర్లతో దండయాత్ర**

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు వారం రోజులుగా తమ ఆందోళనలను ఉధృతం చేయడంతో ఎలాగైనా భూములను అమ్మాలని నిర్ణయించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎదురుదాడికి దిగింది. ఏడాదిన్నరగా తెలంగాణలో బుల్డోజర్-పోలీసు న్యాయాన్ని మాత్రమే నమ్ముకొన్నందున ఇక్కడ కూడా అదే తంత్రాన్ని అమలు చేసింది. పోలీసులతో విద్యార్థులను జుట్టుపట్టి ఈడ్చుకెళ్లి అరెస్టులు చేసింది. వారి నిరసన కార్యక్రమాలను నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. అప్పటికే హైకోర్టులో తమకు గడువు కావాలంటూ కోరిన ప్రభుత్వం ఈలోగానే అడవిని అంతం చేసే దుస్సాహసానికి ఒడిగట్టింది. అందులో భాగంగానే రాత్రిపూట వందల సంఖ్యలో బుల్డోజర్లను మోహరించి వందల ఎకరాల్లో చెట్లను నరికివేయడంతో అరుదైన మొక్కలు, వృక్షాలు నేలకొరిగాయి. మూగజీవాలు గూడు చెదిరి కొన్ని మృత్యువాతపడితే మరికొన్ని జనారణ్యంలోకి వస్తున్నాయి. చివరికి దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకొని నిలువరిస్తే తప్ప రేవంత్ సర్కారు అడవిని అంతం చేసే ప్రక్రియను నిలిపివేయలేదు.

**దిమ్మతిరిగి.. నష్ట నివారణకు దిగి..**

సెంట్రల్ యూనివర్సిటీలో సర్కారు విధ్వంసానికి సుప్రీంకోర్టు చెక్ పెట్టడంతో ప్రభుత్వ పెద్దలకు దిమ్మతిరిగి పోయింది. ఇదే క్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ముందుకొచ్చి 'ఆ 400 ఎకరాలను అధికారంలోకి రాగానే ఎకో పార్కుగా తీర్చిదిద్దుతాం' అని ప్రకటించారు. ఆ భూములను ప్రభుత్వం అమ్మితే తాము ఇంచు భూమితో సహా తిరిగి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో భూములమ్మి రూ.30వేల కోట్లు తెచ్చుకొని 'సంతృప్తి' చెందాలనే ప్రభుత్వ పెద్దల కల ఒక్కసారిగా చెదిరిపోయింది. పర్యావరణాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే పచ్చదనాన్ని హరించివేస్తున్నదంటూ జాతీయ స్థాయిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అప్రతిష్టను మూటగట్టుకోవాల్సి వచ్చింది. అందుకే ఇక తమ వ్యూహం బెడిసికొట్టిందని తత్వం బోధపడి నష్టనివారణ చర్యలకు దిగింది. కేటీఆర్ ప్రకటన తర్వాత గంటల వ్యవధిలోనే సమాలోచనలు చేసుకొని తమ బాకా పత్రికలకు లీకులిచ్చింది. కేవలం 400 ఎకరాల్లోనే కాదు.. మిగిలిన భూమిని సైతం ప్రపంచంలోనే అతి పెద్ద ఎకో పార్కుగా తీర్చిదిద్దే యోచన చేస్తున్నామంటూ రాయించుకున్నారు. పనిలో పనిగా సెంట్రల్ యూనివర్సిటీని అక్కడి నుంచి ఫ్యూచర్ సిటీకి తరలించనున్నామనే మరో కుట్రను సైతం నెమ్మదిగా జనంలోకి వదిలారు.

**పరిస్థితి చేజారడంతోనే పర్యావరణ ప్రవచనాలు..**

అసలు సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలను అమ్ముతామని ప్రభుత్వమే ప్రకటించింది. కానీ జాతీయ స్థాయిలో అభాసుపాలై, వ్యూహం బెడిసికొట్టిన తర్వాత ఇప్పుడు ఎకో పార్కు మంత్రాన్ని జపిస్తున్నది. వాస్తవానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఈ భూములను అమ్మితే తప్ప ఆర్థికంగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి నెలకొన్నదని అధికారికవర్గాలే చెప్తున్నాయి. అసలు ఎక్కడా అప్పు పుట్టడంలేదు.. ఎవరూ నమ్మడంలేదని స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి రవీంద్రభారతిలో వ్యాఖ్యానించడం ఇందుకు నిదర్శనమని గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో 400 ఎకరాల్లో భాగంగా ఫార్మా, రియల్ రంగానికి చెందిన ఒక ప్రముఖ కంపెనీకి సుమారు 150 ఎకరాలను విక్రయించేందుకు గతంలోనే ప్రభుత్వ పెద్దల స్థాయిలో అంతర్గత చర్చలు 'విజయవంతంగా' పూర్తయినట్టు ప్రచారంలో ఉన్నది. ఇలా స్వామి కార్యం.. స్వకార్యం.. రెండూ నెరవేరుతాయనే లక్ష్యంతోనే 400 ఎకరాల విక్రయానికి ప్రభుత్వం దూకుడుగా ముందుకుపోయిందని అధికారులే అంటున్నారు. కాకపోతే ఇప్పుడు చేసేదిలేక ఎకో పార్కును అభివృద్ధి చేస్తామంటూ కొన్ని పత్రికల్లో కథనాలు రాయించుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



హెచ్‌సీయూ వద్ద చదును చేసిన భూమి విహంగ వీక్షణ చిత్రం

## అసలు కథ ఇది..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి పరిధిలోని సర్వే నంబర్ 25లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ఉమ్మడి ఏపీలో అప్పటి సీఎం చంద్రబాబు ఐఎంజీ భారత్‌కు అగ్గువకు కట్టబెట్టారు. 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దు చేసి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నది. ఐఎంజీ భారత్ కోర్టుకు వెళ్లగా తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం కూడా ఆ కేసులో సమర్థవంతమైన వాదనలు వినిపించింది. ఫలితంగా నిరుడు మార్చిలో ఆ భూములు ప్రభుత్వానివేనని కోర్టు తీర్పు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో సర్కారుకు ఆదాయం పడిపోయింది. హామీల అమలు సాధ్యం కాని సర్కారుకు ఈ భూములు హాట్‌కేకుల్లా కనిపించాయి. నిరుడు ఈ 400 ఎకరాల భూమిని వెంటనే టీజీఐఐసీకి బదిలీ చేసి తనఖా పెట్టి రూ.10 వేల కోట్ల రుణాన్ని తీసుకున్నారు. ఐసీఐసీఐ కన్సార్టియం బ్యాంకులు ఈ రుణాన్ని ఇచ్చేందుకుగాను టీజీఐఐసీకి ప్రభుత్వమే పూచీకత్తు ఇచ్చేందుకు నిరుడు అక్టోబర్ 26న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేశారు. రుణ ఒప్పందంలోనే తదనంతరం భూములను అమ్మినట్టయితే రూ.10 వేల కోట్లు తిరిగి చెల్లిస్తామనే వెసులుబాటును కూడా చేర్చారు.


## కాసులు 'చే'జారిన తీరిది!

సెంట్రల్ యూనివర్సిటీ భూముల తాకట్టుతో వచ్చిన రూ.10 వేల కోట్ల రుణంతో రైతులకు రైతుభరోసా ఇవ్వాలని తొలుత ప్రభుత్వం భావించినట్టు బాకా పత్రికల్లోనే రోజుల తరబడి వార్తలు వచ్చాయి. తీరా రుణం వచ్చిన తర్వాత రైతుభరోసాకే భరోసా లేకుండా పోయింది. సర్కారు వర్గాల్లోనే వినిపిస్తున్న గుసగుసల మేరకైతే రూ.10 వేల కోట్లను రైతుభరోసా కోసం కాకుండా కొందరు మంత్రులు కాంట్రాక్టు బిల్లులకు మళ్లించారు. ఈ క్రమంలోనే 20-30 శాతం కమీషన్లు అంటూ కాంట్రాక్టర్లతో సహా లోకం కోడైకూసింది. అందుకే ఇప్పటిదాకా కనీసం ఐదెకరాలకు కూడా ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వలేకపోయింది.

## రాహుల్ చేతికి రక్తపు మరక: కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): రాహుల్‌గాంధీ చేతికి రక్తపు మరక అంటిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. హెచ్‌సీయూలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన విధ్వంసానికి శుక్రవారం ఓ జింకపై కుక్కల గుంపు దాడి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కంచ గచ్చిబౌలి మినీఫారెస్ట్‌ను బుద్ధిహీనంగా నాశనం చేయడం వల్ల విలువైన వృక్ష, జంతు జాలం తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు.



Beacon Trusteeship Limited
5W, 5th Floor, The Metropolitan,
Bandra Kurla Complex, Bandra(East),
Mumbai, Maharashtra, India, 400051
022 26558759
compliance@beacontrustee.co.in
http://beacontrustee.co.in/
The Bonds would be secured by way of
- Exclusive charge by way of mortgage by deposit of title deeds of Designated Land Bank admeasuring around 400 acres, with unencumbered ownership / sale rights, located at Sy.No.25, Kancha Gachibowli Village, Serilingampally Mandal, Ranga Reddy District, Telangana.
- Exclusive charge by way of hypothecation on the TSIICL BOND SERVICING ESCROW ACCOUNT and the amount transferred therein.

భూముల తనఖాపై బెకాన్ ట్రస్టీషిప్ విడుదల చేసిన డాక్యుమెంట్

# ఇవి జింకలా.. గుంటనక్కలా?

- సీఎం వచ్చి నిర్ధారణ చేసుకోవాలి
- హెచ్‌సీయూ విద్యార్థుల సవాల్

నిన్నటి దాకా కంచ గచ్చిబౌలి స్క్రబ్ అడవిలో భయం లేకుండా బతికిన మూగజీవాలు ఆవాసం కోల్పోయి.. అటు తాగునీటి కొరత.. ఇటు నీడనిచ్చే చెట్ల కూల్చివేత.. ఈ పరిస్థితుల్లో గూడు చెదిరి విశ్వవిద్యాలయం ఆవరణలోకి వచ్చి, కుక్కల నోటికి చిక్కి శవమైన మచ్చల జింక కళేబరం సీఎం సారుకు కనిపిస్తున్నదా? పరమ పవిత్రమైన, అత్యున్నతమైన చట్టసభలో సభానాయకుడి హోదాలో నిలబడి అక్కడ జింకలు లేవు.. గుంటనక్కలే ఉన్నాయంటూ చేసిన మీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలిగించమని సభాపతిని వేడుకుంటారా? -హెచ్‌సీయూ విద్యార్థులు

హైదరాబాద్, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూలో శుక్రవారం మచ్చల జింకపై కుక్కలు దాడి చేశాయి. ఇన్నాళ్లుగా తమకు ఆశ్రయం ఇచ్చిన అటవీ ఆవాసం ఒక్కసారిగా చెదిరిపోవడంతో జింకలు సమీప కాలనీల్లోకి నీళ్ల కోసం వస్తున్నాయని స్థానికులు చెప్తున్నారు. తమ ఇంటి ముందుకు వచ్చిన మూగజీవాలకు స్థానికులు నీళ్లు పెట్టి, వీడియోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేస్తున్నారు. గురువారం సాయంత్రం ఒక దుప్పి సమీపంలోని గోపన్‌పల్లి అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లగా స్థానికులు నీళ్లు పెట్టిన దృశ్యం సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నది. ప్రభుత్వ బుల్డోజర్లు ధ్వంసం చేసిన అడవి నుంచే శుక్రవారం హెచ్‌సీయూ సౌత్ క్యాంపస్‌లోకి మచ్చల జింక ప్రవేశించినట్టు విద్యార్థులు చెప్తున్నారు. అటుగా వచ్చిన కుక్కల గుంపు జింక మీద దాడిచేయగా, సెక్యూరిటీ అధికారులు కుక్కలను దూరంగా తరమివేసి, విద్యార్థుల సహకారంతో ఆ జింకను హాస్పిటల్‌కు తరలించారు. దవాఖానలోనే జింక మరణించినట్టు తెలుస్తున్నది.

**ఏడాదిలో ఆరు జింకల మృతి**

క్యాంపస్ లోపల జింకలు నిత్యం తిరుగుతూనే ఉంటాయి. వేసవికాలంలో ఎక్కువ సంఖ్యలో జింకలు బయటికి వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయని, ఇందుకు ప్రధాన కారణం జంతువులకు నీటి సౌకర్యం లేకపోవడమేనని విద్యార్థులు చెప్తున్నారు. జింకలపై కుక్కలు దాడులకు పాల్పడ్డ ఘటనలు అనేకం ఉన్నాయని, ఈ ఏడాది ఇప్పటివరకు ఆరు జింకలు చనిపోయాయని వివరిస్తున్నారు. ఇలాంటి సందర్భం ఎదురైన ప్రతిసారీ తాము జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్తున్నారు. బయోడైవర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనాలు సైతం అందుబాటులోనే ఉన్నాయని, కంచ గచ్చిబౌలి స్క్రబ్ అడవుల్లో జింకలున్నాయో.. గుంటనక్కలే ఉన్నాయో..! పందికొక్కులే ఉన్నాయో? వచ్చి నిర్ధారణ చేసుకోవచ్చని విద్యార్థులు సవాలు చేస్తున్నారు. శుక్రవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నడిబొడ్డున అడవి ఉన్నదని నమ్మేవాళ్లు భ్రమల్లో బతుకుతున్నారని విమర్శించారు. అసలు అడవిలోనే జింకలు లేవని, ఇక్కడ జింకలు ఎక్కడివంటూ గడుసుతనం ప్రదర్శించారు. అక్కడ ఓపెన్ భూములు ఉన్నాయి కాబట్టి, నెమళ్లు రావడానికి అవకాశం ఉన్నదని తెలిపారు. ఎంపీ వ్యాఖ్యలపై సోషల్‌మీడియాలో ట్రోలింగ్‌కు గురవుతున్నాయి.



శుక్రవారం గోపన్‌పల్లి ఎన్టీఆర్ నగర్‌లోని ఓ ఇంటి ఆవరణలోకి వచ్చిన జింక

ఫొటో: జి. చిన్నయాదగిరిగౌడ్



ఓ ఇంటి ఆవరణలోకి వచ్చిన జింకను ఆసక్తిగా చూస్తున్న స్థానికులు

# వనం వదిలి.. జనంలోకి

- హెచ్‌సీయూలో బుల్డోజర్లతో బెదిరిన జీవాలు
- ప్రాణభయంతో వివిధ ప్రాంతాలకు పరుగులు
- ఆవాసాలు కోల్పోయి మూగజీవాల అవస్థలు
- గోపన్‌పల్లి, ఎన్టీఆర్ నగర్‌లో జింక సంచారం
- జూపార్క్‌కు తరలించిన అటవీశాఖ అధికారులు

శేరిలింగంపల్లి, మార్చి 4: హెచ్‌సీయూ కంచ గచ్చిబౌలిలో ప్రశాంతంగా బతికిన మూగజీవాలు నేడు ప్రాణభయంతో పరుగులు తీస్తున్నాయి. చెట్లను, ఆవాసాలను బుల్డోజర్లు నేలమట్టం చేస్తుంటే బెదిరిన జింకలు గమ్యం ఎటో తెలియకుండా పరుగులు తీస్తున్నాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో జింకలు సంచరిస్తూ కనిపిస్తున్నాయి. శుక్రవారం గోపన్‌పల్లి, ఎన్టీఆర్ నగర్‌లో ఓ జింక హృదయవిదారకంగా తిరుగుతూ కనిపించింది. రహదారిపై ఉన్న పలు షాపుల్లోకి వెళ్తూ, బయటకు వస్తూ భయపడుతూ కనిపించింది. ఎన్టీఆర్ నగర్ ప్రధాన రహదారిపై పరుగెత్తగా వీధి కుక్కలు వెంటపడ్డాయి. స్థానికులు జింకను కుక్కల బారినుంచి కాపాడారు. ఆ తర్వాత జింక కనిపించిన ఇంట్లోకి వెళ్తూ, అక్కడి మనుషులను చూసి బెదిరిపోతూ బయటకు వచ్చింది. చివరికి ప్రహరీ గేటు లాక్ వేసి ఉన్న ఓ ఇంటి ఆవరణలోకి గోడదూకి వెళ్లింది. కుక్కలు లోపలికి వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో జింక చాలాసేపు ప్రశాంతంగా అక్కడే తలదాచుకుంది. జింకను చూసేందుకు చాలామంది స్థానికులు అక్కడ గుమిగూడారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు, అటవీశాఖ అధికారులు, యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ ప్రతినిధులు జింకను నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు తరలించారు. జింక కొమ్ముకు స్వల్ప గాయమైందని, రెండు రోజులు చికిత్స అందించి జూపార్క్‌లో వదిలిపెడుతామని అటవీ శాఖ అధికారులు చెప్పారు.

## ధరలు పెరగడంతోనే భూములపై కన్ను

- ఆ భూములపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : భూముల ధరలు పెరగడంతోనే హెచ్‌సీయూ భూములపై అందరి కన్ను పడిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ పేర్కొన్నారు. ఆ భూముల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ హయాంలో హెచ్‌సీయూకు భూములు కేటాయించినట్టు గుర్తుచేశారు. రాజశేఖర్‌రెడ్డి సీఎగా ఉన్నప్పుడు కేర్ యాజమాన్యం దవాఖాన కోసం సహకరించాలని కోరిందని చెప్పారు. ఆ భూములను విద్యా ప్రయోజనాలకే ఉపయోగించాలని తాము డిమాండ్ చేసినట్టు గుర్తుచేశారు. మరోవైపు వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదంతో లౌకిక వ్యవస్థకు చీకటి రోజులు వచ్చాయని, దీంతో మతఘర్షణలు తలెత్తే అవకాశం ఉన్నదని కే నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు.

## హెచ్‌సీయూలో జీవవైవిధ్యాన్ని కాపాడాలి

**ఆదిత్యఠాక్రే, తుషార్‌గాంధీ డిమాండ్**

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల్లో అటవీ నిర్మూలనను ఆపాలని, జీవవైవిధ్యాన్ని కాపాడాలని శివసేన(యూబీటీ)నేతఆదిత్య ఠాక్రే డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. తెలంగాణ ప్రభుత్వం జీవవైవిధ్యం విలువను గుర్తిస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. అలాగే ప్రముఖ రచయిత తుషార్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ హైకమాండ్ రేవంత్‌రెడ్డిని మందలించకపోతే వారు తమ హైకమాండ్ హోదా గురించి పునరాలోచించుకోవాలని చెప్పారు.

## సినిమా వాళ్లకు రాజకీయాలెందుకు?

- ఆ భూములతో మీకేం సంబంధం?
- సినీ ప్రొడ్యూసర్‌కు ముఖ్యనేత వార్నింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): 'చూసీ చూడనట్టు వదిలిపెడుతుంటే మీరు హద్దులు దాటుతున్నారు.. హెచ్‌సీయూ భూములతో మీకేం సంబంధం.. మీ పని మీరు చూసుకోకుండా రాజకీయాల్లో వేలెందుకు పెడుతున్నారు, మీ వ్యక్తిగత ప్రచారం కోసం ప్రభుత్వాన్ని విమర్శిస్తారా' అంటూ తెలంగాణ ముఖ్యనేత సినిమా వాళ్లపై ఫైర్ అయినట్టు తెలిసింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో చెట్లను కూల్చడం మీద సినీ ప్రముఖులు స్పందించటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ప్రభుత్వాన్ని విమర్శిస్తే తోలు తీస్తామంటూ హెచ్చరించినట్టు సినీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. సినీ ఇండస్ట్రీని లీడ్ చేస్తున్న ఓ ప్రముఖ ప్రొడ్యూసర్‌కు ముఖ్యనేత ఫోన్ చేసి ఎడాపెడా దురుసుగా మాట్లాడినట్టు సినీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

**సినిమావారి వీడియోలు వైరల్**

మరోవైపు పలువురు తెలుగు సినీ ప్రముఖులు ప్రభుత్వ దాష్టీకాన్ని నిరసించారు. 'మీరు ఇదే గనక చేయాలనుకుంటే అక్కడున్న మూగజీవాలు, పక్షులకు ఎక్కడ పునరావాసం కల్పిస్తారు? నరికివేసిన చెట్లను తిరిగి ఎక్కడ పెంచుతారు?' అని సినీ హీరో రాంచరణ్ సతీమణి ఉపాసన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'సీఎం రేవంత్‌రెడ్డిగారూ ఒక తల్లిగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నా. మన రేపటితరానికి ఆక్సిజన్, నీళ్లు అవసరం. అభివృద్ధి అవసరం. ఐటీ పార్కులు, బహుళ అంతస్తుల భవనాలు.. అన్నీ అవసరమే! కానీ ఈ 400 ఎకరాలను మాత్రం వదిలేయండి. నిర్మానుష్యంగా ఉన్న భూములను వెతకండి. దయచేసి మిమ్మల్ని వేడుకుంటున్నాను. ఏదో ఒకటి చేయండి. ఒక తల్లిగా అడుక్కుంటున్నాను. ఒక్కసారి ఆలోచించండి' అంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాజీ భార్య, నటి రేణూదేశాయ్ వీడియో రిలీజ్ చేశారు. మూగజీవాలను అడవి నుంచి తరిమేయకండి అంటూ యాంకర్ రష్మీ గౌతమ్ మరో వీడియో రిలీజ్ చేశారు. ఈ వీడియోలకు నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. సినీ ప్రముఖుల స్పందనతోనే హెచ్‌సీయూ భూముల విధ్వంసం వీడియో వైరల్ అయిందని భావించిన ముఖ్యనేత వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది.

## వారసత్వ భూమిని కబ్జా చేస్తున్నాడు

- స్థానిక ఎమ్మెల్యే అనుచరుడినని బెదిరిస్తున్నాడు
- న్యాయం చేయాలని విలపించిన బాధిత మహిళ

హనుమకొండ, ఏప్రిల్ 4 :' వారసత్వంగా వస్తున్న భూమిని కాంగ్రెస్ నాయకుడు కోన శ్రీకర్ కబ్జా చేస్తున్నాడు.. ఇదేంటి అని అడిగితే స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడిని' అని బెదిరిస్తున్నాడని వడ్డేపల్లికి చెందిన బాధిత మహిళ చింతల స్వరూప భోరున విలపించింది. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నగరంలోని వడ్డెపల్లి ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని ఉన్న ప్రాంతంలో తన మామ (భర్త తండ్రి) చింతల వెంకట్రాం నర్సయ్య నుంచి సంక్రమించిన ఇంటిలో 30 సంవత్సరాలుగా నివిసిస్తున్నానని, ఈ భూమికి సంబంధించి ఇంటి నంబర్ 2-9-1241 సహా కరెంట్ బిల్లు, నల్లా కనెక్షన్ లాంటి ప్రభుత్వ గుర్తింపు హక్కులను కలిగి ఉన్నాని తెలిపారు. అన్ని రకాల పన్నులు సైతం చెల్లిస్తున్నాని చెప్పారు. ఆ స్థలాన్ని కాంగ్రెస్ నాయకుడు కోన శ్రీకర్ కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించారు. తాను లేని సమయంలో పాత ఇంటిని, ప్రహరీ, టాయిలెట్లను కూల్చివేశాడని తెలిపింది. ఇందిరమ్మ ఇంటిని సైతం కూలగొడుతానంటూ బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారంలో ఉన్నాం.. అడ్డొస్తే చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని కన్నీటి పర్యంతమైంది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడినని బెదిరిస్తున్నాడని తెలిపింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయడంలేదని వాపోయింది. తనకు వారసత్వంగా వచ్చిన ఇంటి స్థలాన్ని కాంగ్రెస్ నాయకుడి కబ్జా నుంచి కాపాడి న్యాయం చేయాలని వేడుకుంటున్నది. కోన శ్రీకర్ నుంచి తనకు ప్రాణ భయం ఉందని వాపోయింది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాంగ్రెస్ నాయకుడి కబ్జా నుంచి తన భూమిని కాపాడి, న్యాయం చేయాలని బాధిత మహిళ స్వరూప వేడుకుంటున్నది.



కూల్చిన ఇంటిని, ప్రహరీని చూపిస్తున్న చింతల స్వరూప